

- కీలకమైన పదవుల కోసం కాంగ్రెస్ సీనియర్ నేతల ప్రయత్నాలు
- నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ, నుడా చైర్మన్ పదవులపైనే కన్ను
- రాజధానిలోనే మకాం వేసి ఎమ్మెల్యేలు, మంత్రులను కలుస్తూ విజ్ఞప్తి

నామినేటెడ్ పదవుల కోసం పోటీ!



నిజామాబాద్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో నామినేటెడ్ పదవుల కోసం పోటీ పెరిగింది. కాంగ్రెస్‌లో పదేళ్ల నుంచి పనిచేస్తున్న సీనియర్ నేతలతోపాటు ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన నేతలు ఈ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలను, మంత్రులను కలుస్తూ తమకు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. హైదరాబాద్‌లోనే మకాం వేసి ఈ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో కీలకమైన నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీతోపాటు నుడా చైర్మన్ పోస్టు కోసం ఎక్కువ మంది నేతలు పోటీపడుతూ గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. ఈ పోస్టులు జిల్లాలో కీలకమైనవి కావడం, ఆర్థికంగా నిధులు ఉండే పోస్టులు కావడంతో సయోధ్యతో భర్తీ చేసేందుకు ఎమ్మెల్యేలు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈపోస్టుల కోసం నిజామాబాద్ రూరల్, అర్బన్‌తోపాటు బోధన్ నియోజకవర్గానికి చెందిననేతలు ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఇవే కాకుండా ఇతర నామినేటెడ్ పదవులు ఉన్న ప్రధానంగా నేతల మధ్య ఈ రెండు పోస్టులపై ఎక్కువగా పోటీ కొనసాగుతోంది.

నిజామాబాద్ మార్కెట్ చైర్మన్ కోసం పట్టు

జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీలతోపాటు జిల్లా గ్రంథాలయ సంస్థ, నుడా చైర్మన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ సంస్థలకు చైర్మన్‌లతోపాటు డైరెక్టర్లను నియమిస్తారు. మార్కెట్ కమిటీలకు ఆయా నియోజకవర్గాల పరిధిలోని ఎమ్మెల్యేలు సిఫారసు చేసిన వారికే పదవులను ఇస్తారు. చైర్మన్‌తోపాటు డైరెక్టర్లను నియమిస్తారు. వీరి సిఫారసుల ద్వారానే ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా ఉత్తర్వులను జారీ చేస్తుంది. జిల్లాలో నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీతోపాటు బోధన్, ఆర్మూర్, వేల్పూర్, కమ్మర్‌పల్లి, కోటగిరి, వర్ని మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ప్రధానంగా ఆరు కమిటీలకు ఇబ్బందులు లేకున్నా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీపైనే అందరు నేతల దృష్టి ఉంది. ఈ మార్కెట్ కమిటీ నిజామాబాద్ రూరల్ అర్బన్, బోధన్, ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలో ఉంటుంది. ఈ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల వారే ఎక్కువగా ఈ కమిటీకి వచ్చి అమ్మకాలను చేస్తారు. ఇవేకాకుండా పసుపుఅమ్మకాల కోసం జిల్లా రైతులతోపాటు నిర్మల్, జగిత్యాల రైతులు కూడా తమ ఉత్పత్తులను తీసుకువచ్చి అమ్మకాలను చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం వందల కోట్ల టర్నోవర్ ఈ మార్కెట్ ద్వారా జరుగుతుంది. మార్కెట్ ద్వారా 10 నుంచి 15 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. నగరం నడిబొడ్డున ఉండటం మార్కెట్ కమిటీ చైర్మన్ అయితే హవా కొనసాగే అవకాశం ఉండటంతో ఎక్కువమంది నేతలు దృష్టిపెట్టారు.

ఎమ్మెల్యేల సిఫారసులు

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని రూరల్ నియోజకవర్గం నుంచి సీనియర్‌నేతకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డి సిఫారసు కోరుతున్నారు. ఇతర నియోజకవర్గాల నుంచి డైరెక్టర్ల నియామకానికి అవకాశం ఇవ్వాలని తెలిపారు. ఇప్పటికే కొంత కదలిక వచ్చిన రూరల్ నియోజకవర్గానికి చెందిన మరికొంత మంది నేతలు నుడా చైర్మన్ పోస్టు కూడా కోరడంతో సందిగ్ధత ఏర్పడింది. జిల్లా కు చెందిన ఎమ్మెల్యేలు, నేతలు మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో కొలిక్కి వచ్చింది. రూరల్ నియోజకవర్గం నుంచి చైర్మన్ నియామకం చేయడంతోపాటు అర్బన్ నుంచి నుడా చైర్మన్ ఎంపిక చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు.

నుడా కోసం పోటీ..

నిజామాబాద్ అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ (నుడా) చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ నేతలు ఎక్కువమంది పోటీ పడుతున్నారు. నిజామాబాద్ శివారులో 75 గ్రామాల పరిధిలో విస్తరించి ఉన్న నుడాకు ఆదాయం ఉండటం ప్రభుత్వం నుంచి నిధులు రానుండటంతో కీలకమైన ఈ పోస్టు కోసం ఎక్కువ మంది నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీకి తాను చేసిన సేవలకు అనుగుణంగా ఈ పదవిని ఇవ్వాలని కోరుతున్నారు. వీరితో పాటు ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన నేతలు కూడా కొన్ని నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. తమకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరుతున్నారు. జిల్లాలో దీర్ఘకాలికంగా పనిచేసిన నేతలు మాత్రం పదేళ్ల తిప్పలుపడ్డ తమకు పదవులను ఇవ్వాలని కోరుతున్నారు. జిల్లాలో కీలకంగా ఉన్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి కోసం కూడా కొంత మంది నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సంస్థ చైర్మన్ కీలకమైన అన్ని సమావేశాలకు హాజరయ్యే అవకాశం ఉండటంతో తమకు ఈ పదవిని కేటాయించాలని కోరుతున్నారు. సీనియర్ నేతలు, మంత్రులను కలుస్తూ విజ్ఞప్తి చేస్తున్నారు. నామినేటెడ్ పదవులు కొలిక్కి వస్తున్నాయని ఈ నెలల్లోనే కొన్ని భర్తీ చేసే అవకాశం ఉందని అధికార పార్టీకి చెందిన సీనియర్ నేతలు తెలిపారు. జిల్లాలో ఎవరికి నామినేటెడ్ పదవి రానున్నాయో త్వరలో తేలే అవకాశం ఉంది.





వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ధరణి పెండింగ్ దరఖాస్తులను

సత్వరమే పరిష్కరించాలి

- సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు3: ధరణి పెండింగ్ దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ సూచించారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ధరణి సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా నూతన ఆర్‌వోఆర్ ముసాయిదా బిల్లు 2024పై ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు వీలుగా సీసీఎల్ఏ వెబ్‌సైట్ సీసీఎల్ఏ.తెలంగాణ.జీవోవీ.ఇన్ ద్వారా అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ముసాయిదా బిల్లుపై ప్రజలు ఎవరైనా సరే తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. సలహాలు, సూచనలను ఈమెయిల్ ఆర్‌వోఆర్2024-ఆర్ఈవితెలంగాణ.జీవోవీ.ఇన్ ద్వారా తెలపవచ్చని లేదా పోస్టు ద్వారా కూడా ల్యాండ్‌లీగల్ సెల్ సీసీఎల్ఏ కార్యాలయం నాంపల్లి, స్టేషన్‌రోడ్, అన్నపూర్ణ హోటల్ ఎదురుగా హైదరాబాద్ 5000001 చిరునామాకు పంపవచ్చన్నారు. అనంతరం ఆయా మండలాల తహశీల్దార్లతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళిక బద్ధంగా పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ సూచనల మేరకు వీలైనంత త్వరగా పెండింగ్‌లో ఉన్న వాటిని పూర్తి చేయాలన్నారు. తహశీల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారి స్థాయిలలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వారం పది రోజుల్లోగా పూర్తిచేయాలన్నారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను రికార్డులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వెంట వెంటనే పరిష్కరించాలన్నారు. మండలాల వారిగా పెండింగ్ దరఖాస్తులను సమీక్ష చేసుకోవాలని సుదీర్ఘకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న వాటిని ముందుగా పరిశీలన జరిపి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్రస్థాయిలో ప్రతీ మంగళవారం, శుక్రవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పిస్తున్న అర్జీలను ఆయా శాఖలకు బదిలీ చేయడం జరుగుతుందని వాటికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ తహశీల్దార్లకు సూచించారు. సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో వివిధ అంశాలను వివరంగా పేర్కొనాలని అన్నారు. ఏదైనా అర్జీని తిరస్కరిస్తే అందుకు గల కారణాలను తెలియజేయాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, నిజామాబాద్, ఆర్మూర్ ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శంకర్ భవన్ పాఠశాల తనిఖీ

- డైనింగ్ హాల్‌లో క్లాస్ రూమ్‌లు నిర్వహించవద్దని డీఈవో ఆదేశం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు3: 'సర్కారు బడిలో పలు శాఖల కార్యాలయాలు' అనే శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతి నిజామాబాద్ జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైన కథనానికి డీఈవో ఎన్.వి.దుర్గాప్రసాద్ స్పందించారు. శనివారం ఆయన నగరంలోని శంకర్‌భవన్ (కోటగల్లి) ప్రభుత్వఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు.పాఠశాలలో ఎంఈవో కార్యాలయం, అగస్త్యఫౌండేషన్, జిల్లా విద్యాశాఖకు సంబంధించిన ఫైళ్లు, డీసీఈబీ కార్యాలయం ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు తరగతి గదులు సరిపోక డైనింగ్‌హాల్‌లో తరగతి గదులు నిర్వహిస్తున్నారని ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చింది. దీనికి డీఈవో పాఠశాలను తనిఖీ చేసి వెంటనే డైనింగ్ హాల్‌లో నిర్వహిస్తున్న తరగతులను ఇతర చోటికి మార్చాలన్నారు. అదేవిధంగా అగస్త్య ఫౌండేషన్ పాఠశాల ఏర్పాటు చేసిన విషయం తమకు తెలియదని వెంటనే దాన్ని మరోక చోటికి మార్చాలని ఇంచార్జి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ ఇతర కార్యాలయాల ఏర్పాటు వల్ల పాఠశాలలో తరగతి గదులు సరిపోవడం లేదని వెంటనే వాటిని మార్చాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సాదాసీదాగా కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

- డీఎస్ విగ్రహ ఏర్పాటుకు సభ్యుల ఏకగ్రీవ తీర్మానం



మాట్లాడుతున్న మేయర్



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

సుభాష్‌నగర్, ఆగస్టు3: నగరమేయర్ దండు నీతూ కిరణ్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన నగర పాలక సంస్థ కౌన్సిల్ ప్రత్యేకసమావేశం సాదాసీదాగా సాగింది. నగరంలో డి.శ్రీనివాస్ విగ్రహ ఏర్పాటుచేసే తీర్మానాన్ని సభ్యుల మద్దతుతో ఆమోదం తెలిపారు. ఏకైక ఎజెండాతో సమావేశాన్ని నిర్వహించినట్లు నగర మేయర్ దండు నీతూకిరణ్ తెలిపారు. మొదటగా సభ్యులు స్వర్గీయ డి.శ్రీనివాస్ మృతికి 2నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు డి.శ్రీనివాస్ ఎంతో కృషి చేశారని అన్నారు. డి.శ్రీనివాస్ రాష్ట్ర రాజకీయాల్లో తనదైన శైలిలో ప్రజలకు ఎంతో సేవ చేశారని నగర అభివృద్ధికి దోహదపడ్డారని అన్నారు. ఆయనకు గుర్తుగా నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గౌరవ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఇచ్చిన అభ్యర్థన మేరకు కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యుల మద్దతుతో ఆమోదం పొందినట్లు తెలిపారు. డి.శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటులో డి.శ్రీనివాస్ కీలకంగా వ్యవహరించారని అన్నారు. డి.శ్రీనివాస్ సేవలు నిజామాబాద్ జిల్లా వాసులు మరువరని అన్నారు. కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గతంలోనే భారతీరాణి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానం జరిగిందని 17వ డివిజన్ కార్పొరేటర్ సవిత శ్రీనివాస్‌రావు అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన భారతీరాణి విగ్రహాన్ని కూడా ఏర్పా టు చేయాలని డిమాండ్‌చేశారు. మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే కౌన్సిల్‌సమావేశం ఏర్పాటు చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. సమాచారం ఇవ్వకపోవడంపై మున్సిపల్ కమిషనర్ మందమకరంద్ సీరియస్ అయ్యారు. సమావేశంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



- గోల్‌బంగ్లా వద్ద మలుపుల్లో ప్రమాదకరంగా ఉన్న లోయలు





- అధ్వానంగా నిజాంసాగర్ నుంచి మాసాన్‌పల్లి ఎక్స్ రోడ్డు రహదారి
- సాగు కాల్వలుగా సైడ్‌బొరములు
- ఇరువైపులా రోడ్డును ముంచేస్తున్న ముళ్ల చెట్లు
- రహదారిపై ప్రయాణం నరకమే..
- వీఐపీలు రాకపోకలు జరిగినా ఫలితం శూన్యమే..
- పట్టించుకోని అధికారులు

నిజాంసాగర్‌పై ఇంత నిర్లక్ష్యమా!?

నిజాంసాగర్, ఆగస్టు 3: ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారుతున్నా నిజాంసాగర్ రూపురేఖలు మారడం లేదు. ప్రాజెక్టు అందాలు, ప్రాజెక్టు కట్టడాలు ఎంతో చూడముచ్చటగా ఉన్నా ప్రస్తుత పాలకులు నిజాంసాగర్ అందాలపై పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ప్రాచీన కట్టడాలు, గార్డెన్లు, రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. వీటిని చూసేందుకు వచ్చే పర్యాటకులు, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తూనే ఉన్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు 1932లో నిర్మాణం పూర్తిచేసి జాతికి అంకితం చేశారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో కనువిందు చేసే అతిథి గృహంతో పాటు గుల్‌గస్తీ గార్డెన్, వీఐపీ అతిథిగృహాలను ఏర్పాటు చేశారు. ఎత్తైన కొండపైనిర్మించినగోల్ బంగ్లా చూపరులకు నిరాశగానే మిగిలిస్తోంది. మండలకేంద్రం నుంచి పొరుగు జిల్లాకు వెళ్లే రహదారి అధ్వానంగా మారి ఈ రహదారిగుండా వీఐపీ అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు కూడా ఈ రహదారి గుండానే వెళుతుంటారు. నాగమడుగు, గోల్‌బంగ్లా మలుపుల్లో సైడ్‌బొరములు కోతకు గురై ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గోల్‌బంగ్లా నుంచి సంగారెడ్డి జిల్లా మాసాన్‌పల్లి వరకు రహదారి చెట్లు, ముండ్ల చెట్లతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. 20వరద గేట్ల నుంచి మాసాన్‌పల్లి గేటువరకు రైతులు సైడ్ బొరములను సాగు కాల్వలుగా మార్చివేశారు. ఈ రహదారి గుండా వెళ్లాలంటే అనేక పాట్లు పడుతూనే ఉన్నారు. నిజాంసాగర్ గుల్‌గస్తీ గార్డెన్ నిర్వహణ లేకపోవడంతో కళాహీనంగా మారింది. వీఐపీ అతిథి గృహం వద్ద ఉన్న గార్డెన్ కూడా అధ్వానంగా మారింది.

అధికారుల నిర్లక్ష్య వైఖరి

కారణంగాఉన్న చెట్లు ఎండిపోయాయి. గోల్‌బంగ్లా పర్యాటకులకు కనువిందు చేసే విధంగా ఉన్నప్పటికీ ఈ బంగ్లాను అధికార యంత్రాంగం నిర్వహణ సిరిగ్గా చేయలేకపోవడంతో నీటి పారుదలశాఖ నిర్వహణ కొరవడటంతో పేకాటరాయుళ్లు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గుల్‌గస్తీ బంగ్లాను అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిజాంసాగర్ పర్యటనకు వస్తారని లక్షల రూపాయలు వెచ్చించి కనువిందు చేసేందుకు ఆదరబాదరగా మరమ్మతులు చేశారు. అయితే అవి మున్నాళ్లకే పాడైపోయాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి పురాతన బస్టాండ్ వరకు తారురోడ్డు ఏళ్లక్రితం నుంచి ఉన్నా బీటిరోడ్డుగా మార్చాలనే ఆలోచనఅధికారులకు లేకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికార యంత్రాంగం స్పందించి నిజాంసాగర్ అందాలతోపాటు రహదారులను మెరుగు పర్చాలని ఉభయ జిల్లాల పర్యాటకులు, వాహనదారులు కోరుతున్నారు.



- వీఐపీలు రాకపోకలు సాగించే రహదారి అధ్వానంగా..
- నిజాంసాగర్ ఘాట్ రోడ్డుకు రేయిలింగ్ లేని దృశ్యం





బదిలీపై వెళ్లిన ఫార్మాసిస్ట్‌కు సన్మానం

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 3 : పెద్దకొడప్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఫార్మాసిస్ట్‌గా విధులు నిర్వహించిన సంగమేశ్వర్ బదిలీ అయ్యారు. దీంతో మండల కేంద్రానికి చెందిన పీఎంపీ వైద్యులు, మెడికల్ అసోషి యే షన్ ప్రతినిధులు సంగమేశ్వర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఫార్మాసిస్ట్ సంగమేశ్వర్ మాట్లాడుతూ 12 సంవత్సరాలు మండ లంలో ఆరోగ్యసేవలు అందించేందుకు సహకరించిన ప్రతిఒక్కరిలో కృతజ్ఞత లు తెలిపారు.



పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి


పెద్దకొడప్‌గల్, ఆగస్టు 3 : పెద్ద కొడప్‌గల్ గ్రామ శివారులో సాగవు తున్న పత్తి, సోయా పంటలను శనివారం మండల వ్యవసాయాధికారి నదీమ్ ఉద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని ప్రాంతాలలో పంట ముంపునకు గురైన సమ యంలో త్వరగా కోలుకోవాలంటే 19:19:19 లేదా 13-0-45 లేదా 10 గ్రా యూరియా లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని సూచించారు. నేల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ళ నివా రణకు 3 గ్రామలు కాపర్-ఆక్సి-క్లోరైడ్ లేదా 2 గ్రాముల కార్బెండ జిమ్ ప్లస్ మ్యాంకో జెబ్ శిలీంద్రనాశక మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్లు వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలని సూచించారు. ఇంకా ఏమైనా సలహాలు కావాలంటే వ్యవసాయ శాఖ అధి కారులను సంప్రదించాలని సూచించారు.

'ఉపాధ్యాయుల సమస్యలు తీర్చేందుకు కృషి'


పెద్దకొడప్‌గల్, ఆగస్టు 3 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యా యుల సమస్యలు తీర్చే ఏకైక సంఘం పిఆర్‌టీయూ మాత్రమే అని జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి కుషాల్ తెలిపారు. శనివారం పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో నిర్వహించిన పీఆర్‌టీయూ నూతన ఎన్నిక కార్యవర్గానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కుషాల్ మాట్లా డుతూ 10 సంవత్సరాల కాలంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు లేక ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని తెలు సుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయపరమైన సమస్యలు ఎదు రైనా వాటిని అధిగమించి ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులు చేపట్టారని తెలిపారు. దీంతో తాము సీఎం రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు. దీంతో పాటుగానే పాఠశాలల్లో సమస్యల గురించి తమ సంఘ పెద్దలు సీఎం రేవంత్ దృష్టికి తీసుకురాగా త్వరలో పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తామని సీఎం హామీ ఇవ్వడంతో ఉపాధ్యాయులు సంతోషంగా ఉన్నారని తెలిపారు.















ప్రమాదాలకు అడ్డాగా వర్ని-కోటగిరి రహదారి

● ఏడేళ్లలో పలువురు మృత్యువాత
● 20 మందికి పైగా క్షతగాత్రులు


వాహనం అదుపు తప్పి బురద గుంతలో పడిన ద్విచక్రవాహనదారుడు

వర్ని, ఆగస్టు 3 : రహదారుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నా అభివృద్ధిలో ఆదరణ సాధ్యం కావడం లేదు. వర్ని మండల కేంద్రం నుంచి తగిలేపల్లి గ్రామం మీదుగా కోటగిరి మండల కేంద్రం వరకు గల రహదారి అధ్వానంగా తయారైంది. ఈ రహదారి అభివృద్ధి కోసం గత ప్రభుత్వం సుమారు రూ.కోటి రూపాయల నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వం మారడంతో రోడ్డు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. నాలుగు మండలాలకు మహారాష్ట్ర ప్రజలకు సౌకర్యంగా ఉన్న ఈ రహదారి ప్రస్తుతం చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. రోడ్డంతా బీటీ ఛిద్రమైంది. కిలోమీటర్ల పొడవున బురదమయంగా మారింది. దీంతో వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. గడిచిన ఏడేళ్లలో ద్విచక్రవాహనాలపై నుంచి పడి నలుగురు మృతిచెందారు. ఆటో, ట్రాక్టర్లు బోల్తాపడి 20 మందికి పైగా కాళ్లు, చేతులు విరిగి ఆసుపత్రుల పాలయ్యారు. తరుచూ ప్రమాదాలు జరిగినా ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం స్పందించిన దాఖలాలు లేవు. రాజకీయ నాయకులు మృతులు, క్షతగాత్రులను పరామర్శించి చేతులు దులుపుకుంటున్నారు. రోడ్డు అభివృద్ధిపై పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇకనైనా ఆర్‌అండ్‌బీ అధికారులు, ప్రభుత్వ పాలకులు వర్ని-కోటగిరి రోడ్డు అభివృద్ధి కోసం చర్యలు చేపట్టి తమ ప్రాణాలు కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌రూరల్, ఆగస్టు 3 : ఇటీవల సైబర్ నేరగాళ్లు అనేక విధాలుగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ వస్తున్న ఫేక్ వీడియో, వాయిస్ కాల్స్‌ను ప్రజలు నమ్మవద్దని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. ఇటీవల బోధన్ డివిజన్‌లోని పలు ప్రాంతాల ప్రజలకు ఫేక్ వీడియో, వాయిస్ కాల్స్ భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. ఫేక్ వీడియో, వాయిస్ కాల్స్‌లో వాట్సప్ డీపీలో సైబర్ నేరగాళ్లు ఢిల్లీ పోలీసులమంటూ ఓ నకిలీ పోలీసు ఫోటో పెట్టి తమ పిల్లల పేరిట భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ప్రజలకు వస్తున్న ఇటువంటి కాల్స్‌పై పూర్తి విచారణ చేపడుతున్నామన్నారు. సైబర్ క్రైమ్ విభాగం ఈ కాల్స్ పట్ల చర్యలు చేపడుతుందన్నారు. ఈ కాల్స్ ఎక్కడి వస్తున్నాయి. ఎవరెవరు మాట్లాడుతున్నారు తదితర అంశాలను సైబర్ క్రైమ్ అధికారులు పరిశీలిస్తున్నారన్నారు. కావున ప్రజలు ఇటువంటి కాల్స్‌కు భయపడవద్దని కాల్‌ను బ్లాక్ చేయాలని ఆయన అన్నారు. వారికి భయపడి డబ్బులు వేయడం కాని డబ్బులు వేయడం కాని ఇతరత్రా పనులు చేయకూడదన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

పాఠశాలకు సీసీ కెమెరాల వితరణ

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 3 : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వవిద్యార్థులు శనివారం పాఠశాలకు సీసీ కెమెరాలు వితరణ చేశారు. 1998-99 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఇటీవల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సీసీ కెమెరాలు వితరణ చేశారు.

డొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో బోనాల సంబరాలు

డొంకేశ్వర్, ఆగస్టు 3 : డొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సరస్వతి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి పాఠశాల నుంచి ప్రారంభమైన బోనాల ఊరేగింపు బస్టాండ్ మీదుగా పోచమ్మ ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. పాఠశాల ఆవరణలో పూలతో అందంగా అలంకరించి బోనం కుండాలను అందంగా తయారు చేసి విద్యార్థినిలు బోనాలు ఎత్తుకొని, విద్యార్థుల వివిధ వేషాదారణలతో చేసిన నృత్యాలకు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీడీసీ క్యాషియర్ గంగారెడ్డి, సదానంద్, సాయికుమార్, సాయిలు, రాజేశ్వర్, మహేష్‌కుమార్, వెంకటరమణచారి, అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి'

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 3 : గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవరాం, సబ్‌డివిజన్ కార్యదర్శి కిషన్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన గోడప్రతులను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్ళ కాలంలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని, అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు ఇస్తామని హామీఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకూ కార్యరూపం దాల్చలేదన్నారు. మాస్‌లైన్ జిల్లానాయకులు ఎస్.ముత్తెన్న, సబ్‌డివిజన్ నాయకులు శేఖర్, ఠాగూర్, గంగన్న, రాజన్న, నరేంధర్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ యువకులకు ఏఈఈ కొలువులు

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు3: గత సంవత్సరం నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (ఏఈఈ) పరీక్ష ఫలితాల్లో ఆర్మూర్‌కు చెందిన యువకులు ఉత్తీర్ణులై కొలువు సాధించారు. మిర్దాపల్లి గ్రామానికి చెందిన ఎం.సింధు పంచాయతీరాజ్ శాఖలో ఏఈఈ పోస్టుకు ఎంపిక కాగా, పెర్కిట్‌కు చెందిన కామని అమూల్య, ఆర్మూర్‌కు చెందిన గైని సాగర్ ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈలుగా, కోశనం అభినవ్ పీఆర్ ఏఈఈ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇటీవల ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న వీరు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు వారిని అభినందించారు.

నవీపేట పంచాయతీరాజ్ ఏఈగా జాబేర్ బాధ్యతల స్వీకరణ

నవీపేట, ఆగస్టు 3 : మండల పంచాయతీ రాజ్ ఏఈగా శనివారం జాబేర్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో బాన్సువాడలో పంచాయతీ రాజ్ ఏఈగా పనిచేసిన ఆయన బదిలీపై వచ్చారు. నవీపేట ఏఈగా పనిచేసిన శ్రావణ్‌కుమార్ నిజామాబాద్ రూరల్ మండలానికి బదిలీ అయ్యారు.

వ్యక్తి అదృశ్యం

బోధన్ రూరల్, ఆగస్టు 3 : సాలూర మండలంలోని హున్సా గ్రామానికి చెందిన శివకుమార్ అనేవ్యక్తి 15 రోజుల క్రితం అదృశ్యం అయినట్లు బోధన్‌రూరల్ ఎస్‌ఐ నాగనాథ్ తెలిపారు. శివకుమార్ తన అక్క గ్రామమైన ఎత్తొండ వెళ్లి తిరిగి వస్తానని ఇప్పటి వరకు తిరిగి రాకపోవడంతో అతని మేనమామ తుడిమె హన్మాండ్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. సీసీపుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ జరిపి త్వరలోనే కుటుంబసభ్యులకు అప్పజెప్తామన్నారు.

చిన్నజీయర్ స్వామిని కలిసిన మైనారిటీ రాష్ట్ర నాయకులు

బోధన్‌రూరల్, ఆగస్టు3 : చిన్న జీయర్ స్వామిని శనివారం హైదరాబాద్‌లో బోధన్ బీఆర్‌ఎస్ పార్టీ మైనారిటీ రాష్ట్ర నాయకులు రజాక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఓ కార్యక్రమంలో చిన్నజీయర్‌స్వామి వద్దకు వెళ్లి అతని ఆశీర్వాదం తీసుకున్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసి మెలిసి ఉండేలా చూడాలని వేడుకున్నారు.

పెట్రోల్ బంక్ కోసం స్థల పరిశీలన

బోధన్‌రూరల్,ఆగస్టు3: బోధన్ బస్టాండ్ సమీపంలోని ఆర్టీసీ స్థలంలో హెచ్‌పీసీఎల్ కంపెనీ ప్రతినిధులు శనివారం స్థల పరిశీలన నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. పెట్రోల్ బంక్ కోసం స్థలం అనుకూలంగా ఉందా లేదా అనే నిర్ధారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు తదితరులున్నారు.

సీపీఎం విరాళాల సేకరణ

వర్ని, ఆగస్టు3: కేరళ వరద బాధితుల కోసం సీపీఎం వర్ని ఏరియా కమిటీ ఆధ్వర్యంలో శనివారం విరాళాలు సేకరించారు. కేరళ వరద బాధితులను ఆదుకునేందుకు దేశంలో సీపీఎం పార్టీ కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించి కేరళ ప్రజలకు అండగా నిలవాలనే సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు వర్ని మండలంలో విరాళాలు సేకరించామని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ తెలిపారు.

రుద్రూరు : కేరళ వరద బాధితుల కోసం సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో విరాళాలను సేకరిస్తున్నామని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ పేర్కొన్నారు. శనివారం రుద్రూర్ మండలంలోని పలు ప్రాంతాలలో తిరుగుతూ ప్రజల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించామని తెలిపారు.

అంగన్‌వాడీలో చిన్నారులకు అన్నప్రాసన

ఏర్గట్ల, ఆగస్టు 3: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించినట్లు ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు నాగలక్ష్మీ తెలిపారు. ఆగస్టునెలలో వారం రోజుల పాటు తల్లిపాల విశిష్టతను వివరిస్తూ, మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నిర్వాహకులు, చిన్నారులు, గర్భిణీలు పాల్గొన్నారు.

'బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలి'

ఎడపల్లి, ఆగస్టు 3 : మండలంలోని జానకంపేట గ్రామంలో గల ఆర్టీసీ బస్టాండులో కనీససౌకర్యాలు కల్పించాలని, సీసీ రోడ్డు నిర్మించాలని జానకంపేట సహకార సంఘం చైర్మన్ మిద్దె నరేందర్ అన్నారు. గ్రామంలో ఉన్న ఆర్టీసీ బస్టాండును శనివారం ఆయన గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండు ఏర్పాటుకు 1988 సంవత్సరంలో గ్రామస్థులంతా కలిసి 3 ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చామన్నారు. కొన్నేళ్ళపాటు సజావుగా బస్సులు లోనికి వెళ్లాయని, ఆ తరువాత బస్సులు లోనికి వెళ్లకపోవడంతో అధికారులకు విన్నవించారు. మూత్రశాలలు, తాగునీరు వంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి

బోధన్‌రూరల్, ఆగస్టు 3 : బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామానికి చెందిన బొమ్మడి రాములు(43)అనే వ్యక్తి శనివారం ప్రమాదవశాత్తు పంట పొలం పక్కనే ఉన్న నీటి కుంటలో పడి మృతిచెందినట్లు రూరల్ ఎస్‌ఐ నాగనాథ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతిరోజు తన పొలంలో పనుల నిమిత్తం వెళ్తుండేవాడని, శనివారం పనులు ముగించుకుని అక్కడే ఉన్న కుంటలో కాళ్లు, చేతులు కడుక్కోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోగా ఈత రాక కుంటలోనే మృతి చెందాడని ఆయన తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

ముప్కాల్, ఆగస్టు 3 : ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన బొట్ల రవి ఇటీవల మృతిచెందగా శనివారం ముప్కాల్ తాజా మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నాయకుడు పద్మకిషన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసహాయం అందజేశారు. అలాగే దొమకోండ బాలయ్య మృతిచెందగా మృతుని కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. మృతుని కుటుంబసభ్యులు నాయకుడు పద్మకిషన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆజాంగంజ్‌లో లారీలను తొలగించాలని వినతి

బోధన్‌రూరల్, ఆగస్టు 3 : బోధన్ పట్టణంలోని ఆజాంగంజ్‌లో రహదారికి ఇరువైపులా నిలిపి ఉంచుతున్న లారీలపై చర్యలు తీసుకోవాలని, వాటిని రోడ్డుప్రాంతం గుండా లారీలు నిల్వకుండా తొలగించాలని శనివారం కాలనీవాసులు బోధన్ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ భారత ఆహార సంస్థ గోదాములకు వెళ్లే లారీలు రహదారికి ఇరువైపులా నిలిపి ఉంచుతున్నారని, దీని వల్ల కాలనీవాసులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి, కాలినడక ప్రయాణం చేయడానికి కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారికి ఇరువైపులా నిలిపి ఉన్న లారీలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇరువైపులా నిలుపుతున్న లారీలను తొలగించాలని కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కారంపొడితో విద్యార్థులకు భోజనం

కోటగిరి, ఆగస్టు 3 : మధ్యాహ్నభోజనంలో విద్యార్థులకు కారంపొడితో భోజనం చేయాల్సి రావడంపై తల్లిదండ్రులు తీవ్రఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. కోటగిరి మండలంలోని కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కారంపొడితో భోజనం పెట్టారు. మధ్యాహ్న భోజన సమయంలో కూర రుచిగా లేకపోవడంతో విద్యార్థులు కారంపొడి వేసుకుని భోజనం చేసే ప్రయత్నం చేశారు. కొంతమంది కారంతో భోజనం చేయలేక అన్నం పడేశారు. ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిసింది. శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించారు. ఎంఈవోకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎంఈవో నాగనాథ్‌ను వివరణ కోరగా కూర సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులు కారంపొడి వేసుకుని భోజనం చేశారన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలి

● రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారథి


మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల అధికారి

పెర్కిట్, ఆగస్టు 3 : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారథి అన్నారు. చిట్ల ప్రమిల జీవన్‌రాజ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విద్యాస్ఫూర్తి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఉన్నతవిలువలతో కూడిన చదువును అందించేలా ప్రోత్సహించాలని, విద్యార్థులు మొబైల్ వినియోగంతో చాలా వరకు మంచిని గ్రహించవచ్చని కానీ కొందరు మొబైల్‌ను దుర్వినియోగపరుస్తున్నారని తల్లిదండ్రులు ఆ విధంగా జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అదే విధంగా విద్యార్థులు ప్రతీక్షణం పర్యవేక్షించాలని అన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థిని విద్యార్థులను వారి గురించి మాట్లాడమని అడిగి వారిలో ఉన్న భయాన్ని పోగొట్టారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ తల్లిదండ్రుల పట్ల గౌరవంగా ఉండాలని బాలుర పాఠశాల పూర్వ విద్యార్థి అయిన పార్థసారథి గత 17ఏళ్లుగా వారి తల్లిదండ్రుల పేరు మీద ట్రస్ట్ ఏర్పాటు చేసి, ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఈవో దుర్గాప్రసాద్, ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ గజానన్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఎంఈవో రాజాగంగారాం, వివిధ శాఖల అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేయండి


కమ్మర్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న పీడీడీఆర్డీవో

కమ్మర్‌పల్లి, ఆగస్టు 3 : స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని అన్నిశాఖ అధికారులుసమన్వంతో వందశాతం విజయవతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి (పీడీడీఆర్డీవో) మండల ప్రత్యేక అధికారి సాయగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ని రైతు వేదికలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో ఎంపీడీవో రాజా శ్రీనివాస్, ఎంఈవో ఆంద్రయ్య, ఎంపీవో సదాశివ్, ఏపీఎం కుంట గంగారెడ్డి, ఏఈవో అబ్దుల్ మలిక్, వేటర్నరి డాక్టర్ రాజేశ్వర్‌రావు వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏర్గట్ల : మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఈ నెల 8 నుంచి 9 వరకు రెండు రోజుల పాటు నిర్వహించబోయే స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో శివచరణ్, ఏపీఎమ్ శ్యామ్ పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ :ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని బోధన్ మండల ప్రత్యేక అధికారి, డీపీవో తరుణ్ కుమార్ అన్నారు. శనివారం బోధన్ మండల పరిషత్ సమావేశపు మందిరంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, గ్రామస్థాయి కమిటీ సభ్యులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు.

జక్రాన్‌పల్లి:స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. శనివారం జక్రాన్‌పల్లిలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంపై మండల స్థాయి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

రుద్రూరు: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం విజయవంతం కావడానికి మండలం లోని అధికారులు కృషిచేయాలని మండల ప్రత్యేక అధికారి నిర్మల పేర్కొన్నారు. శనివారం రుద్రూరు మండలపరిషత్ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వ హించారు. సమావేశంలో ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మోర్తాడ్ : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛదనం- పచ్చదానం కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో మండలంలోని గ్రామాల వారీగా యాక్షన్‌ప్లాన్ రూపొందించారు. కార్యక్రమంలో గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు, ఎంపీడీవో తిరుమల, ఏవో లావణ్య, ఎంపీవో శ్రీధర్, ఏపీవో శకుంతల, ఏపీఎం ప్రమీల, ఏఈ స్వరాజ్, సూపరిండెంట్, ఆరోగ్య శాఖ అధికారులు, ఐకెపీ సిబ్బంది పాల్గొన్నారు.

మోస్రా: మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల ప్రత్యేక అధికారి రమేష్ స్వచ్ఛదనం.. పచ్చదనంపై గ్రామ పంచాయతీ మహిళ సంఘం, ఉపాధి హామీ, అంగన్‌వాడీ, ఆశా సిబ్బందికి ఆయన సూచనలిచ్చారు.

ఆర్మూర్‌రూరల్:పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛదనం-పచ్చదానం కార్యక్రమంపై శనివారం అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్మూర్ మండల ప్రత్యేక అధికారి, డీసీవో శ్రీనివాస్, ఎంపీడీవో సాయిరాంలు మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు.

'రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దు'

ఎడపల్లి, ఆగస్టు 3 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రకటించిన రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి సిద్దిరామేశ్వర్ అన్నారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు మేనేజరుతో రుణమాఫీ కాని రైతులు వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి సిద్ద రామేశ్వర్ బ్యాంకుకు వెళ్ళి రైతులతో, బ్యాంకు మేనేజరుతో మాట్లాడి రైతులకు వివరంగా తెలిపి భరోసా కల్పించారు. రైతులు 10 రోజుల పాటు వేచి ఉండాలని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే లబ్దిదారులను నిర్ధారించి డబ్బులను రుణ ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఇది గమనించి ప్రభుత్వానికి సహకరించాలని ఆయన రైతులను కోరారు.

రుణమాఫీ పొందిన రైతులకు పంట రుణాలు

కోటగిరి, ఆగస్టు 3 : కోటగిరి సహకార సంఘంలో రుణమాఫీ పొందిన రైతులకు శనివారం కొత్త పంట రుణాలను విండో అధ్యక్షులు కూచి శ్రీనివాస్ పంపిణీ చేశారు. కోటగిరి సహకార సంఘంలో తొలి విడత రుణమాఫీలో 59 మంది రైతులకు 19,13,732 రూపాయలు మాఫీ అయింది. రెండో విడతలో 26 మంది రైతులకు 10,75,613 రూపాయలు మాఫీ వచ్చినట్లు విండో అధ్యక్షులు తెలిపారు. తొలివిడతలో రుణమాఫీ పొందిన 26 మంది రైతులకు ఎకరానికి 44వేల రూపాయల చొప్పున 11,84,200రూపాయల పంట రుణాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో విండో డైరెక్టర్ శ్రీధర్ బాబు, నాయకులు గాండ్ల శ్రీనివాస్, శ్యామ్, విండో కార్యదర్శి విఠల్, రైతులు పాల్గొన్నారు.

ధర్పల్లిలో సామూహిక సీమంతాలు

ధర్పల్లి, ఆగస్టు 3 : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ సిబ్బంది తల్లిపాల ఆవశ్యకతను గర్భిణులు, బాలింతలకు వివరించారు. తల్లిపాలు బిడ్డ తాగడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. తల్లిపాలలో ఉన్న పోషక పదార్థాలు బిడ్డ ఆరోగ్యంగా పుట్టడానికి దోహదపడుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్‌లు, ఆశవర్కర్‌లు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జక్రాన్‌పల్లి, ఆగస్టు3: మండలంలోని వివేక్‌నగర్‌తండా వద్ద 44వ జాతీయరహదారిపై శనివారం బైక్ డివైడర్‌ను ఢీకొని గుర్తుతెలియని వ్యక్తికి గాయాలైనట్లు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. బైక్‌పై గుర్తు తెలియనివ్యక్తి ఆర్మూర్ నుంచి డిచ్‌పల్లి వైపు వెళ్తుండగా వివేక్‌నగర్ తండా వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొందని ఈ ప్రమాదంలో గాయపడ్డ గుర్తుతెలియని వ్యక్తిని 108అంబులెన్స్‌లో ఆర్మూర్‌కు తరలించారు.

వివాహిత ఆత్మహత్య

రెంజల్, ఆగస్టు3 : రుద్రూరు మండల కేంద్రానికి చెందిన బొంబాయి శైలజ (30) అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని ఎస్‌ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రుద్రూరు గ్రామానికి చెందిన శైలజ శుక్రవారం ఉదయం కందకుర్తి గ్రామంలో తన భర్త సంజీవ్ వేరే మహిళను పెళ్లి చేసుకుని ఆమెతో ఉన్నాడని తెలిసి కందకుర్తి గ్రామానికి వెళ్లి భర్తను నిలదీసింది. దీంతో భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. భర్త సంజీవ్ మందలించడంతో కందకుర్తి గ్రామం నుంచి సాటాపూర్‌కు వచ్చింది. సాటాపూర్‌లో మందు తాగి మృతిచెందిందని ఎస్‌ఐ తెలిపారు. శనివారం ఉదయం సాటాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తులు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. మృతురాలి సోదరుడు గంగాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలని ధర్నా

ఆర్మూర్ టౌన్, ఆగస్టు 3 : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయాలని భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నిరుపేదలకు ఇళ్ళస్థలాలు, కొత్త పింఛన్‌లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని, జాబ్‌క్యాలెండర్‌ను విడుదల చేసి జీవన్‌భృతిని వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారత రైతు కూలీసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొట్ల రాజు, ఎస్.సుధాకర్, సహాయ కార్యదర్శి సయ్యద్, పెద్దులు, బొట్ల గంగారాం, భానుబేగం, అరుణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

బోధన్‌రూరల్, ఆగస్టు 3 : బోధన్ పట్టణంలోని కోర్టులో శనివారం రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య ఆదేశాల మేరకు కోర్టు ప్రాంగణంలో చట్టాలపై అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య భారతీయ న్యాయసంహిత చట్టం 2023గురించి వివరించారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

డొంకేశ్వర్, ఆగస్టు3: డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామంలో శనివారం కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్తల బృందం సందర్శించి మొక్కజొన్న, సోయా, వరి, ఆయిల్‌పాం పంటలను పరిశీలించారు. మొక్కజొన్న పంటకు బ్యాక్టీరియా కాండం కుళ్లు ఆశించినట్టు నిర్ధారించి దీని నివారణకు 35శాతం క్లోరిన్ కలిగినటువంటి బ్లీచింగ్‌పౌడర్‌ను ఎకరానికి ఐదు కిలోల చొప్పున ఇసుకలో కలిపి చల్లుకోవాలని సూచించారు. అక్సిక్లోరైడ్, పోటాష్ పంటకు వేసినట్లయితే బ్యాక్టీరియ తెగులు నివారించవచ్చని రైతులకు సూచించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

● ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణలత

వేల్పూర్, ఆగస్టు 3 : తల్లిపాలే బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని భీమ్‌గల్ ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణలత అన్నారు. శనివారం వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తల్లులకు, గర్భిణీలకు బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో స్వర్ణలత మాట్లాడుతూ తల్లి పాలలో వివిధ రకాల పోషకాలు ఉంటాయని, శిశువు ఎదుగుదలకు ఉపకరిస్తాయన్నారు. రోగనిరోధక శక్తి ఉండడంతో పాటు అనారోగ్య సమస్యలుండవన్నారు. బిడ్డ జన్మించిన గంటలోపు వచ్చే పాలను ముర్రుపాలు అంటారని ఆ పాలు తప్పనిసరిగా బిడ్డకు అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగహంస, సెక్టార్ లీడర్ డి.స్వరూప, అంగన్‌వాడి టీచర్‌లు మంజుల, సునంద, కె.స్వరూప, ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్‌లు, గర్భిణీ, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు ఎంతగానో శ్రేయస్కరమని ఎసిడిపీవో జ్ఞానేశ్వరి అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం మండలం లోని బషీరాబాద్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లులకు అవగాహన కార్యక్రమంలో ఆమే పాల్గొన్నారు. గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు మంజుల, అరుణమాల, పద్మ, ప్రణవ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమలత పేర్కొన్నారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని వల్లభాపూర్, జల్లాపల్లి గ్రామాలలో శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమలత మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతాయన్నారు. డబ్బా పాల కన్నా తల్లిపాలు తాగే పిల్లలు బలంగా, తెలివిగా ఉండడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని పేర్కొన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు నుంచి ఆరునెలల వరకు తల్లిపాలు తప్పకుండా ఇవ్వాలన్నారు. తల్లిపాలు తేలికగా జీర్ణం అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మణి, అంగన్‌వాడీ టీచర్ బాలలక్ష్మీ తదితరులున్నారు.

తల్లి పాలతోనే బిడ్డకు పోషకాలు



తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న సూపరింటెండెంట్



నర్సాపూర్ అంగన్‌వాడీకేంద్రంలో సామూహిక సీమంతాలు చేస్తున్న దృశ్యం

పెద్దబజార్, ఆగస్టు 3: తల్లిపాలలోనే బిడ్డలకు అన్ని పోషకాలను అందుతాయని, పసి వయస్సులో వ్యాధుల బారినపడకుండా కాపాడుతాయని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో, సీడీపీవో డిచ్‌పల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9నెలలు మోసి కన్న బిడ్డలను పెంచడంలో తల్లిపాత్ర ప్రాముఖ్యమైందని అన్నారు. తల్లిపాలలో అద్భుతమైన శక్తి ఉంటుందని పుట్టిన బిడ్డకు వెంటనే స్తన్యం ఇవ్వడం చాలా అవసరమని అన్నారు. దీనిపై అవగాహన కలిపించేందుకు ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ దేశాలలో తల్లిపాల వారోత్సవాలను జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి స్వర్ణలత, కోఆర్డినేటర్ రంజిత్, అంగన్‌వాడి టీచర్లు సురేఖ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం

బోధన్‌రూరల్3: బోధన్ పట్టణంతో పాటు సాలూర, బోధన్ మండలాల్లోని తదితర గ్రామాలలో శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ మహిళలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. చిన్న పిల్లలు గల తల్లులకు తల్లిపాల విశిష్టత గురించి అవగాహన కల్పించారు. ఈనెల 7 వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత, గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, రేణుక, ఏఎన్‌ఎంలు ప్రమీలా, సావిత్రి, సీహెచ్‌వో అంజలి, ఆశా కార్యకర్త పుష్ప, అంగన్‌వాడీ ఆయా జరీనా, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

పారిశుధ్యంపైనే దృష్టి సారించాలి

● డీఎల్‌పీవో శ్రీనివాస్

ధర్పల్లి, ఆగస్టు3: పారిశుధ్య పనులపైనే ప్రత్యేక దృష్టిసారించాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోగల రైతువేదికలో గ్రామస్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో నెలకొన్న పరిస్థితులతో అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్రమం తప్పకుండా గ్రామంలో కార్యదర్శులు సమీక్ష నిర్వహించుకొని గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా జూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించుకోవాలని చెప్పారు. ఈనెల 5 నుంచి 9 వరకు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమాలు ప్రతీరోజు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, తహసీల్దార్ ప్రవీణ్, మండల అధికారులు, అన్నిశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మకుంటలో ఉచిత వైద్య శిబిరం

మోపాల్, ఆగస్టు 3:మండలంలోని ఎల్లమ్మకుంట గ్రామంలో శనివారం వైద్య ఆరోగ్య అధికారులు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో కొందరు అనారోగ్యబారిన పడటంతో అధికారులు తెలుసుకొని ప్రత్యేక ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. అనారోగ్యానికి గురవుతున్న గిరిజనులు వైద్య శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన

సిరికొండ, ఆగస్టు3: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని కేంద్రాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పిల్లల బరువును చూసి తల్లులకు సరైన ఆరోగ్య సూచనలు చేశారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు.

నగర శివారులో చిరుత కలకలం

సుభాష్‌నగర్, ఆగస్టు3: నగర శివారు ప్రాంతమైన నాగారం డంపింగ్ యార్డు ప్రాంతంలో చిరుత కలకలం రేపింది. అక్కడ ఉన్న స్థానికులకు చిరుతకనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. డంపింగ్ యార్డు సమీపంలో బండరాయిపై చిరుతను గుర్తించిన స్థానికులు చిరుతను ఫొటోలు, వీడియోలు తీశారు. వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి ఉత్తర మండల ఫారెస్టు అధికారి సంజయ్‌గౌడ్ చేరుకొని చిరుత ఆనవాళ్లను గుర్తించారు. చిరుతసంచారం నిజమేనని మల్లారం అటవీప్రాంతంలో చిరుతలు ఉన్నాయని ప్రజలు అటవీ ప్రాంతంలోకి వెళ్లేవారు గుంపులుగా వెళ్లాలని సూచించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దని కోరారు.

7న దివ్యాంగ విద్యార్థులకు నిర్ధారణ శిబిరం

నిజామాబాద్‌అర్బన్, ఆగస్టు3: దివ్యాంగ విద్యార్థులకు ఈనెల 7న ఉచితసహాయ ఉపకరణాల పంపిణీ కోసం నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు డీఈవో ఎన్.వి.దుర్గాప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీ (కేసీఆర్ కాలనీ)లోగల న్యూ ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఉచిత నిర్ధారణ శిబిరం జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష మరియు ఆల్మికో ముంబాయి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. దివ్యాంగ విద్యార్థులకు వినికిడి యంత్రాలు, వీల్‌చైర్, మూడుచక్రాల సైకిల్, చంక కర్రలు, కృత్రిమ అవయవాలు, అంధులకు అవసరమైన కేన్, 16 నుంచి 18 ఏళ్ల విద్యను అభ్యసిస్తున్న అర్హతకలిగిన విద్యార్థులకు (శారీరక దివ్యాంగులకు) మూడు చక్రాల స్కూటర్, దృష్టిలోపం కలిగి అర్హత కలిగిన వారికి స్మార్ట్ మొబైల్ అందించడానికి నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, ఆదాయధృవపత్రం, రేషన్‌కార్డుజిరాక్స్ రెండు ఫొటోలు, యుడిఐడి కార్డు జిరాక్స్ వెంట తీసుకురావాలని సూచించారు.

7, 21, 28 తేదీల్లో సదరం క్యాంపులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు3: ప్రతీనెల జిల్లాలోని దివ్యాంగుల వికలాంగత్వ నిర్ధారణ కోసం ఈనెల 7, 21, 28 తేదీలలో సదరం క్యాంపులను నిర్వహించనున్నట్లు డీఆర్‌డీవో సాయాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జిల్లాప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిజామాబాద్‌లో సదరం క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 4న ఉదయం 11.30ల నుంచి దగ్గరలోని మీసేవా కేంద్రాలలో స్లాట్ బుక్ చేసుకోవాలని, రెన్యూవల్ స్లాట్ బుక్ చేసుకునేందుకు రూ.35 చెల్లించాలని ఆయన తెలిపారు.

గాంధీనగర్ కాలనీలో వైద్యశిబిరం

డిచ్‌పల్లి,ఆగస్టు3: మండలకేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో వైద్య శిబిరంలో ఏర్పాటుచేసి వైద్యాధికారి డాక్టర్ వినిత్‌కుమార్ ప్రజల కు వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుజాత, అంగన్‌వాడి సిబ్బంది శీల, భాగ్యలక్ష్మి, అమీనాబేగం, ఖతిజా, ఆశావర్కరు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ఎమర్జెన్సీ వచ్చేలా కాంగ్రెస్ పాలన: అర్బన్ ఎమ్మెల్యే

పెద్దబజార్, ఆగస్టు3: రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం వచ్చేలా ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి సీటుపోతుందనే భయంతో ఉన్నారని, వీటన్నింటినీ చూస్తే ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలన వచ్చేలా ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేసిందంటే ఇప్పుడు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అదే తోవలో పోతోందని విమర్శించారు. రాష్ట్రంలో ఆడబిడ్డలపై అత్యాచారాలు, ప్రశ్నిస్తే నిర్బంధాలు సాగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. డ్రగ్స్‌కు తెలంగాణ అడ్డాగా మారుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అరచేతిలో వైకుంఠం చూపెట్టిలా యావత్ తెలంగాణ ప్రజల కళ్లలో కారం కొట్టినట్లు ఉందన్నారు. ఆరు గ్యారంటీలు, ఐదు డిక్లరేషన్లు, 420 హామీలతో అధికారంలోకి వచ్చి వందరోజుల్లో అమలు చేస్తామన్న హామీలకు పెద్ద గాడిదగుడ్డు పెట్టిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌పై బీజేపీ, ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే మంత్రి మండలి ఆమోదం చేసిందన్నారు. రేవంత్ సర్కారులో తన పార్టీలో ఉన్న రాజకీయ నిరుద్యోగులకు మాత్రమే కులానికి ఓ కార్పొరేషన్ పెట్టి పదవులు ఇచ్చి జీతాలు ఇస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, న్యాలంరాజు, బద్దం కిషన్, మల్లేష్ యాదవ్, సాయివర్ధన్, వెల్డింగ్ నారాయణ, పల్నాటి కార్తిక్, పాల్గొన్నారు.

టీయూలో కొనసాగుతున్న ఈవెంట్స్

డిచ్‌పల్లి, ఆగస్టు 3:తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ డిపార్ట్‌మెంట్‌లో శనివారం ఈవెంట్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నైపుణ్యత ప్రదర్శనలు, క్రీడా పోటీలను యూనివర్సిటీ అధ్యాపకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి ఈవెంట్స్ నిర్వహించడం వల్ల మెదడుకు మేత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, వినీల, భాగ్యశ్రీ, జశ్వంత్, ఆచార్యులు అపర్ణ, కైసర్ మహ్మద్, వాణి, కిరణ్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి బీఎడ్ సెమిస్టర్ పరీక్షలు

డిచ్‌పల్లి, ఆగస్టు 3: టీయూ పరిధిలోని బీఎడ్ నాల్గో సెమిస్టర్ రెగ్యూలర్, ఒకటి, రెండు, మూడు, నాల్గో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ఆగస్టు 13 నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణ అధికారిణి ఎం.అరుణ తెలిపారు.

స్వచ్ఛదనం, పచ్చదనంపై అవగాహన

మోపాల్, ఆగస్టు3: ఈనెల 5 నుంచి 9వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంపై మండల ప్రత్యేక అధికారి సురేష్‌కుమార్ అధికారులకు అవగాహన కల్పించారు. మండలకేంద్రంలో ఉన్న రైతువేదిక భవనంలో మండల ప్రత్యేకఅధికారి సురేష్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిరోజు గ్రామాల్లో సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలని అన్నారు. రెండోరోజు తాగునీరు, వర్షపునీటి సంరక్షణ వాటిగురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మూడోరోజు లోతట్టు ప్రాంతాల్లో గుంతలు లేకుండా చూడాలని అన్నారు. నాల్గోరోజు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఐదోరోజు ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రజారంగ ప్రాంతాల్లో శుభ్రతను పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థాయి అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాములు, మండల పంచాయతీ అధికారి కిరణ్‌కుమార్, గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

మోపాల్, ఆగస్టు3: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఐఎంఎల్ మాస్ లైన్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముందు గ్రామాల్లో ర్యాలీ నిర్వహిస్తూ తహసీల్దార్ కార్యాలయం వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని, బీడీకార్మికులకు ఆంక్షల్లేకుండా 4వేల జీవనభృతి, ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, నిర్మాణానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు సుధాకర్, కిషన్, మురళి, గంగమళ్లు, గంగారాం, అమూల్య, లలిత, మోహన్, గంగాధర్, లక్ష్మి, సరళ, తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం - పచ్చదనం

సుభాష్‌నగర్, ఆగస్టు3: ఈనెల 5నుంచి 9వరకు నగరంలోని అన్ని డివిజన్‌లలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ మందమకరంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పచ్చదనాన్ని పెంచేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5న ప్రతీ డివిజన్‌లో స్వచ్ఛదనం-పచ్చదనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. 6న సాగునీరు, వర్షపునీరు సంరక్షణపై కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. 7న కాలువలు, నీరు నిలిచిన ప్రాంతాలు, గుంతలు పూడ్చడం, 8న ఆరోగ్యం, వీధికుక్కల బెడదపై, 9న ప్రభుత్వసంస్థలు, ప్రభుత్వస్థలాలను శుభ్రపర్చాలని తెలిపారు.

అటవీ సంపదను కాపాడాలని ఎఫ్ఆర్‌వోకు గ్రామస్థుల వినతి



ఎఫ్ఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ఇందల్వాయి, ఆగస్టు 3: అటవీ సంపదను కాపాడాలని గౌరారం గ్రామస్థులు ఇందల్వాయి ఎఫ్ఆర్‌వో రవిమోహన్‌భట్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందల్వాయి మండలంలోని గౌరారం పరిధిలోగల జీకేతాండాలో అటవీభూమి సర్వేనెంబర్ 389 కంపార్ట్‌మెంట్ 425లో కొందరుగిరిజనులు చెట్లను నరికి పంటలు సాగుచేస్తున్నారని, గౌరారం గ్రామానికి చెందిన పశువులను రానివ్వకుండా అడ్డుకుంటున్నారని గ్రామస్థులు ఎఫ్ఆర్‌వోకు వివరించారు. 425 కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి పశువులను రాకుండా గిరిజనులు అడ్డుకున్నారని గ్రామస్థులు అక్కడికి వెళ్లగా ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అటవీశాఖ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలానికి వెళ్లిన అధికారులు అక్కడ గొడవను సర్దుమనిపించేందుకు గిరిజన మహిళలను నలుగురిని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. గ్రామస్థులతో మాట్లాడి వారికి సర్దిచెప్పారు. గిరిజనులు ప్రభుత్వం ఇచ్చిన పోడుభూముల్లో మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు. అక్రమంగా సాగుచేస్తున్న భూముల్లోకి ఎవరూ వెళ్లవద్దని, జేసీబీతో కందకాలు తవ్వించారు. అనంతరం అటవీశాఖ కార్యాలయానికి తరలించిన మహిళలకు అటవీ భూమిలో పంటలు సాగుచేయవద్దని సర్దిచెప్పి పంపించినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు. ఆయనవెంట అటవీశాఖ సిబ్బంది, పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిలో పోస్టులు

పెద్దబజార్, ఆగస్టు3: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయనున్నట్లు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి. నాగమోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్ పోస్టులు 8, అసోసియేట్ ప్రొఫెసర్ 9, అసిస్టెంట్ ప్రొఫెసర్ 14, ట్యూటర్ 3, జూనియర్ రెసిడెంట్ 18, సివిల్ అసిస్టెంట్ సర్జన్ 10 పోస్టులు కాంట్రాక్టు పద్ధతిలో భర్తీచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4 వరకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 13న ఉదయం 11గంటలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని, 14న 11 గంటలకు నుంచి ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న ఆపరేషన్ ముస్కాన్

ఖిల్లా, ఆగస్టు3: పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆపరేషన్‌ముస్కాన్‌పై కార్యక్రమం కొనసాగుతుందని పోలీస్ కమిషనర్ కల్మేశర్ సింగెనవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1 నుంచి 31 వరకు ఈ కార్యక్రమం కొనసాగిందని, ఇందులో 18 సంవత్సరాల లోపు తప్పిపోయిన, వదిలివేయబడిన, కార్మికులుగా ఉన్న బాల బాలికలకను గుర్తించినట్లు పేర్కొన్నారు. గుర్తించినవారిని వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి అప్పగించడం, తల్లిదండ్రులు లేని వారిని చైల్డ్‌వెల్ఫేర్ కమిటీకి అప్పగించినట్లు తెలిపారు. పిల్లలను కార్మికులుగా పని చేయించుకుంటున్న యజమానులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో జిల్లా వ్యాప్తంగా 74మంది పిల్లలను పట్టుకున్నామని, ఐదుగురికి ఎఫ్ఐఆర్ కేసులునమోదు చేశామని తెలిపారు. డివిజన్లవారిగా నిజామాబాద్ డివిజన్‌లో 26మంది, ఆర్మూర్ 15మంది, బోధన్ 33 మంది పిల్లలను గుర్తించినట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.

5న ప్రజావాణి రద్దు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 3: ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా 5న రద్దు చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ప్రారంభమవుతున్న నేపథ్యంలో అధికారులందరూ క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాల్సి ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వ్యవసాయ కనెక్షన్ మంజూరులో ఆలస్యం లేకుండా చర్యలు

● టీజీ ఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.రవీందర్

సుభాష్‌నగర్, ఆగస్టు3: వ్యవసాయ కనెక్షన్ మంజూరులో ఆలస్యం లేకుండా వెంటవెంటనే చర్యలు తీసుకుంటున్నట్లు టీజీ ఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్.రవీందర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది ఎనిమిది నెలల్లో సుమారు 2,374 సర్వీసులు మంజూరు చేయగా, ఈ సంవత్సరం సుమారు 3,038 సర్వీసులు మంజూరు చేశామని తెలిపారు. దాదాపు 28శాతం పెరుగుదలతో సర్వీసులు మంజూరు చేసినట్లు వివరించారు. ఆన్‌లైన్ పద్ధతి ద్వారా ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిశీలించి, సమస్య ఎక్కడ ఆగిందో ఆన్‌లైన్‌లో చూసుకునే వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. వ్యవసాయ కనెక్షన్ మంజూరులో ఆలస్యం లేకుండా తొందరగా మంజూరు అవుతున్నాయని తెలిపారు. నూతనంగా ఈ స్టోర్ విధానం ప్రవేశపెట్టడం ద్వారా కావాల్సిన మెటీరియల్ ఆన్‌లైన్ ద్వారా రిజర్వు చేసుకొని మెటీరియల్‌ను కావాల్సిన సమయంలో తీసుకొని పనులు ప్రారంభించడంతో వెంటనే మంజూరుకు ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. పేపర్‌వర్క్ లేకుండా ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్ తీసుకునే సౌలభ్యం విద్యుత్ శాఖకు, రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచామని, వంగిన పోల్స్, లూస్‌లైన్‌లను కూడా సరిచేస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయ సర్వీస్ మంజూరుకు అన్ని ఏర్పాట్లు చేసుకొని వెంటవెంటనే మంజూరు చేసేందుకు అహర్నిశలు కృషిచేస్తున్నామని రవీందర్ పేర్కొన్నారు.

'లయన్స్ సేవలు మరింత విస్తృతం చేయాలి'

పెద్దబజార్, ఆగస్టు3: కొత్త సభ్యులను క్లబ్‌లో చేర్పించి లయన్స్‌సేవలు మరింత విస్తృతం చేయాలని లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్ పి.లక్ష్మి అన్నారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లు ప్రపంచవ్యాప్తంగా నిస్వార్థ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని అన్నారు. అనంతరం క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు అబ్బాయి లింబాద్రి, కార్యదర్శి రవీంద్రనాథ్‌గుప్త, కోశాధికారి రాజేంద్రబాబు, కార్యవర్గసభ్యులతోపాటు జిల్లా ఏరియా కోఆర్డినేటర్ యాదగిరి చేతుల మీదుగా ప్రమాణస్వీకారం చేయించారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,200	రూ.67,500	రూ.880

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డీ) (10.00, 4.45, 10.30)
: కల్కి (3డీ తెలుగు) (1.00)
: శివం భజే (7.45)
స్క్రీన్-2 : శివం భజే (10.50, 4.35, 10.20)
: బుడ్డి (1.35, 7.20)
స్క్రీన్-3 : అరోన్ (హిందీ) (10.20, 7.00, 10.10)
: విరాజి (1.30)
: అలనాటి రామచంద్రుడు (3.50)
స్క్రీన్-4 : లారీ ఛాప్టర్-1 (10.05)
: రాయన్ (1.50)
: తిరగబడరా సామి (5.00)
: ఉషా పరిణయం (7.35)
: ఆవరేజ్ స్టూడెంట్ నాని (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : బుడ్డి (తెలుగు) (1.35, 7.30)
: ఆరోన్ (హిందీ) (4.30, 10.20)
స్క్రీన్-2 : ఉషా పరిణయం (10.40)
: కల్కి (తెలుగు) (1.30)
: రాయన్ (4.50)
: పలనాటి రామచంద్రుడు (7.40)
: తిరగబదరా సామి (10.35)
స్క్రీన్-3 : డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (1.30)
: శివం భజే (4.40, 10.40)
: కల్కి (7.20)

దేవి : రాయన్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : తిరగబదరా సామి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్